ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లంతకుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్, ప్రధాన కార్యదర్శి జంగిటి రాజులు పేర్కొన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులు టెట్ గురించి ఆందోళన చెందుతున్నందున మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, గురుకుల పాఠశాలలో టైంటేబుల్‌ను సవరించాలన్నారు. ఆదర్శపాఠశాల ఉపాధ్యాయుల వేతనాలు 010క్రింద చెల్లించాలని, కేజీబీవీ ఉపాధ్యాయుల సమ్మెకాల వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజగం సురేష్, టీఎస్‌యుటీఎఫ్ జిల్లాకార్యదర్శి కోటగిరి లక్ష్మన్ తదితరులు ఉన్నారు.

పోక్సో కోర్టు న్యాయమూర్తిగా రాధికా జైస్వాల్

వేములవాడ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఫాస్ట్‌ట్రాక్, పోక్సో కోర్టు న్యాయమూర్తిగా రాధికా జైస్వాల్‌ను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా ఒకటవ అడిషనల్ సెషన్స్ జిల్లా జడ్జిగా పుష్పలతకు పూర్తి స్థాయి బాధ్యతలు ఇస్తూ ఆదే శాలు జారీ చేశారు. సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారికి న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

- తాజాగా వంట చార్జీల పెంపు
- 2024 డిసెంబర్ నుంచి వర్తింపు
- మూడు విభాగాలుగా మెనూ చార్జీలు
- 635 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల ఏర్పాటు

పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతగా అందించే దిశగా నిరంతరం జిల్లా కలెక్టర్ నుంచి పాఠశాల ప్రధానోపాధ్యాయుల వరకు పర్యవేక్షిస్తున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంట చార్జీలు సరిపోవడం లేదని తరచూ ఆందోళన దిగుతున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం 2024 డిసెంబర్ 1 తేదీ నుంచి వర్తించే విధంగా వంట చార్జీలు పెంచింది. మధ్యాహ్నం భోజన నిర్వాహణకు సంబంధించి మూడు కేటగిరీలుగా చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తుంది. పెరిగిన వంట చార్జీలతో మధ్యాహ్నం భోజనం ఏజెన్సీ నిర్వాహకులకు కొంత ఊరటగా కలుగనున్నది.



ఇంటి నుంచి లంచ్ బాక్సు తెచ్చుకున్న విద్యార్థులు

జిల్లాలో 32 వేల మంది విద్యార్థులకు లబ్ధి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 667 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో అన్ని తరగతుల విద్యార్థులు 79,747 మంది ఉన్నారు. ఇందులో బాలురు 39,147 మంది, బాలికలు 40,600 మంది ఉన్నారు. ఇందులో 511 ప్రభుత్వ పాఠశాలల్లో 32 వేల మంది విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించడానికి జిల్లాలో 635 ఏజెన్సీలను ఏర్పాటు చేశారు. 833 మంది వంట చేసేవారు ఉన్నారు. విద్యార్థులకు సోమవారం కిచిడి. గుడ్డు, వెజిటేబుల్ కర్రీ. మంగళవారం అన్నం. సాంబారు. రాగి జావా. కూరగాయలు. బుధవారం అన్నం, ఆకుకూర పప్పు, వెజిటేబుల్, శుక్రవారం అన్నం, సాంబారు, గుడ్డు, వెజిటేబుల్ కర్రీ, శనివారం రాగి జావ, ఆకుకూర పప్పు, అన్నం వెజిటేబుల్ కర్రీ, విద్యార్థులకు అందిస్తున్నారు, ఏజెన్సీలకు పెరిగిన ధరలు ఇబ్బందికరంగా మారడంతో ప్రభుత్వం మెనూ చార్జీలను మూడు విభాగాలుగా పెంచింది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒకరికి రూ 6.19, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 9.25 పెంచారు. 9,10 తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 11.79 పెంచారు. గుడ్డుకు

మిగతా 8వ పేజీలో..



విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నం



విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలి

ఎగ్‌డే కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇల్లంతకుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు గుడ్డు తినడం ద్వారా కణాల పనితీరు, వాటి ఎదుగుదల పెరుగుతుందన్నారు. గుడ్డుతినే వారిలో పక్షపాతం ముప్పు 12శాతం తగ్గుతుందన్నారు. ఆహారంలో గుడ్డుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనుమేజు రాజు, లక్ష్మి, రాజవ్వ, ఏసుమణి, లక్ష్మిలతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్‌లూం కార్మికుల హక్కుల సాధనకు కృషి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలోని పవర్‌లూం, అనుబంధ రంగాల కార్మికుల హక్కుల సాధన కోసం సంఘం అనేక పోరాటాలు చేస్తుందని లాల్ బాహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో లాల్ బాహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం నాల్గవ మహాసభ కరపత్రాన్ని సంఘం జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంతం రవి మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీలలో జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ లాల్ బాహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం నాల్గవ మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. మహాసభలకు ముఖ్య అతిథితులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొంక విజయ్, ఎలిగేటి రాజు, సోమ నాగరాజు, సదానందం, శ్రీరామ్, రమేష్ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు పోస్టర్ ఆవిష్కరణ

ఇల్లంతకుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను శాస్త్రవిజ్ఞానం పట్ల ఆకర్షితులను చేయడానికి చెకుముకి సైన్స్‌టాలెంట్ టెస్టు ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు పోటీపరీక్షలు దోహదపడుతాయన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీలలో విజేతలు మండలస్థాయిలో ఈనెల 21న పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిణి ప్రేమలత, చెకుముకి సైన్స్ టెస్టు మండల కన్వీనర్ మహేష్‌చంద్ర, కో కన్వీనర్ అనీల్‌కుమార్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు సహాయ సహకారాలు అందిస్తాం

- ఆర్డీవో వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, అధికారుల నుంచి సీనియర్ సిటిజన్స్‌కు సహాయ సహకారాలను అందిస్తామని ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గంను ఎన్నుకొని రాష్ట్ర అధ్యక్షుడు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటేశ్వర్లు మాట్లాడారు. వృద్ధులు వెలిగే జ్యోతులని వారి అనుభవాలను పదిమందికి తెలియజేయాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి నరసింహారావు మాట్లాడుతూ వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం గురించి ప్రతి ఒక్క సీనియర్ సిటిజన్ తెలుసుకోవాలన్నారు. నూతన కార్యవర్గం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి శంకరయ్య, ఉపాధ్యక్షుడు యేనుగుల ఎల్లయ్య, కోశాధికారి దేవదాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణచౌదరి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు త్వరలో చీరల పంపిణీ



చీరలను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



వివిధ జిల్లాల సమాఖ్య అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులందరికీ త్వరలోనే మహిళా శక్తి చీరలు పంపిణీ జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తయారు చేస్తున్న మహిళా శక్తి చీరలను రాష్ట్రంలో 32 జిల్లాలకు చెందిన మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో వారితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి చీరలతో వేలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్‌లు, డైయిరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్‌లు, ఇతర స్వయం ఉపాధి యూనిట్‌లను అందజేశామన్నారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందితే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి మహిళా సంఘాల మహిళలు రుణాలు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకట్రావునగర్‌లో మరమగ్గాల యూనిట్, గీతానగర్‌లోని ప్రాసెసింగ్ యూనిట్ , వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంలను మహిళా సంఘాల ప్రతి నిధులు పరిశీలించారు. చీరల తయారీ, ప్యాకింగ్, గోడౌన్‌ను నేరుగా చూసే అవకాశం వచ్చిందని వారు పేర్కొన్నారు. ఎంతో నాణ్యతతో ఇందరా మహిళ శక్తి చీరలు సిద్ధం అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూప తిరుపతి రెడ్డి, చేనేత జౌళిశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీవో శేషాద్రి, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, చేనేత జౌళిశాఖ ఏడీ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

చేపల ఉత్పత్తితో ఆర్థికాభివృద్ధి

ముస్తాబాద్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : చేపల ఉత్పత్తితో ఆయా సామాజిక వర్గాలు ఆర్థికాభివృద్ధి చెందుతాయని ముస్తాబాద్ మండల సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బందనకల్ గ్రామంలో గల ఊర చెరువులోమత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపలను పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు నిండుగా ఉన్న తరుణంలో బొచ్చెలు, రగులు, బంగారుతీగల చేపపిల్లలను చెరువులో విడిచారు.ఈకార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి కిరణ్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, గ్రామస్థులు కస్తూరి కార్తీక్‌రెడ్డి, తుపాకుల శ్రీనువాస్‌గౌడ్, నాగరాజు, మధు పాల్గొన్నారు.



బందనకల్ చెరువులో చేపలను విడిచిపెడుతున్న సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి తదితరులు

ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రికుల సౌకర్యార్థం సిరిసిల్ల డిపో నుంచి డీలక్స్ బస్సు అన్నవరంతో పాటు ఇతర పుణ్య క్షేత్రాలకు ప్రత్యేకయాత్ర బస్ ప్యాకేజీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 14న మధ్యాహ్నం సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుంచి ద్వారక తిరుమల, పిఠాపురం, అన్నవరం, సింహాచలం, కైలసగిరి, ఆర్కే బీచ్, కనకమహాలక్ష్మి దేవాలయంకు బస్సు వెళ్తుందని పేర్కొన్నారు. అనంతరం తేదీ 16న ఆదివారం రాత్రి బస్సు తిరిగి సిరిసిల్లకు బయలుదేరుతుందని తెలిపారు. అన్నవరం టూర్ ప్యాకేజీలో ఒకరు పెద్దలకు రూ. 2900/-, పిల్లలకు రూ. 2030 టికెట్ చార్జీలు ఉంటాయని టూర్‌లో టిఫిన్, భోజనం, దర్శనాల టికెట్లు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని తెలిపారు. ఆదే విధంగా సిరిసిల్ల డిపో నుంచి గోవా టూర్ ప్యాకేజ్ కూడా ఉందని తెలిపారు. ఈ నెల 21 శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుంచి గోవాకు బస్సు వెళ్తుందన్నారు. సిరిసిల్ల నుంచి బీదర్, హుమ్నాబాద్, గానుగాపూర్, మురడేశ్వర్, గోవా, తుల్జాపూర్‌కు బస్సు వెళ్తుందన్నారు. తిరిగి సోమవారం బస్సు సిరిసిల్లకు బయలుదేరుతుందని ఈ టూర్ ప్యాకేజీ చార్జీలు పెద్దలకు ఒక్కరికి రూ.3900/-, పిల్లలకు ఒక్కరికి రూ.2750/- ఉంటుందన్నారు. ఆసక్తి గల ప్రయాణికులు వెంటనే టికెట్లను బుక్ చేసుకోవాలని తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగా సీఎంఆర్‌ను సరఫరా చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రారైస్‌మిల్లర్లు సీఎంఆర్‌ను సరఫరా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం రా రైస్ మిల్లర్లతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కేటాయింపు, బ్యాంక్ గ్యారెంటీలతో పాటు ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని రారైస్ మిల్లుల వారీగా కేటాయించిన ధాన్యం, ఎస్ఎఫ్ఐకి ఇచ్చిన బియ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైస్‌మిల్లర్లు, సీఎంఆర్‌ను సరఫరా చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నింబంధనల ప్రకారం అన్ని రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నింబధనల ప్రకారం మిల్లులకు ధాన్యం కేటాయిస్తామని స్పష్టం చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాష్ ఉన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

వేములవాడ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం వేములవాడ ప్రభుత్వ పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలను అర్బన్ ఎంఈవో సదానందంతో కలిసి ఆయన ప్రారంభించారు. బాలబాలికలలో శాస్త్రీయ స్వభావాన్ని, తార్కిక ఆలోచనలు, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడానికి ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి లక్ష్మన్, ఉపాధ్యాయులు రవీందర్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు జింక శ్రీధర్, బాలకృష్ణ ఉన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలి



శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హెచ్‌సీయూ వీసీ బీజే రావు, ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్



- యూనివర్సిటీకి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం శ్రద్ధ తీసుకోవాలి
- విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి
- 'శాతవాహన' ద్వితీయ స్నాతకోత్సవంలో ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- 25 మందికి పీహెచ్‌డీ పట్టాలు.. 161 మందికి బంగారు పతకాలు

◄ ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

7

శాతవాహన విశ్వవిద్యాలయ ద్వితీయ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, 161 మందికి బంగారు పతకాలు అందజేశారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. నైపుణ్యం, నిరంతర అభ్యాసం విద్యార్థుల విజయానికి దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలన్నారు. - కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

గన్నేరువరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఇండియన్ బ్యాంకు ముందు నుంచి నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళతో మండల కేంద్రానికి చెందిన మునిగంటి అజయ్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ఆధారంగా వ్యక్తిని కనుగొని శుక్రవారం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్టును ఢీ కొట్టిన లారీ..

● క్లీనర్‌కు స్వల్ప గాయాలు

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెట్టును లారీ ఢీకొట్టగా, క్లీనర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. పల్లీల లోడ్‌తో అహ్మదాబాద్ నుంచి వరంగల్‌వైపు లారీ వెళ్తోంది. ఈ క్రమంలో హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వజూనియర్ కళాశాల ఎదుట మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టింది. దీంతో క్లీనర్‌కు స్వల్పగాయాలు కాగా, ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైతు నేస్తం..

శాస్త్రవేత్తలతో అనుసంధానం


రైతు నేస్తంలో పాల్గొన్న రైతులు

ఆధునిక సాగుపై అన్నదాతలకు అవగాహన

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం... రైతులతో శాస్త్రవేత్తలను అనుసంధానించే కార్యక్రమం. సాగులో ఆధునిక విధానాలు, పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా వ్యవసాయశాఖ చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు చేరువవుతోంది. రెవెన్యూ గ్రామాల్లోని రైతు వేదికల్లో ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులనుంచి రైతులు నేరుగా సలహాలను పొందవచ్చు. మండలంలోని చొప్పదండి, ఆర్నకొండ, గుమ్లాపూర్ రైతు వేదికల్లో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతు వేదికల్లో మండల వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులు హాజరవుతున్నారు. రైతులకు ఒక రోజు ముందే సమాచారాన్ని అందిస్తారు. వీడియో కాన్ఫరెన్సులో అందుబాటులో ఉండే శాస్త్రవేత్తలు, పంటల సాగు, నూతన పంటలపై అవగాహన కల్పిస్తామని రైతులకు సమాచారాన్ని చేరవేస్తారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు వేదికల వద్దకు వెళ్లి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొని పంటల తెగుళ్లు, ఎదుర్కొంటున్న వ్యాధుల గురించి శాస్త్ర వేత్తలతో మాట్లాడి పరిష్కారం పొందవచ్చు.

వ్యవసాయ అనుబంధ శాఖలు అందుబాటులోకి...



ప్రతి వారం నిర్వహించే కాన్ఫరెన్సులో వ్యవసాయంతోపాటు ఉద్యానవన, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ, నీటి పారుదలశాఖకు సంబంధించిన అధికారులు, శాస్త్రవేత్తలు అందు బాటులో ఉంటారు. సాగులో అధిక దిగు బడులు పొందేందుకు అవసరమైన సూచనలు, సలహాలు రైతులు పొందవచ్చు. నూతన సాగు విధానాలు, ఆధునిక పద్ధతులు, పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు నివారణ చర్యలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. ఇప్పటికే వ్యవసాయశాఖ రైతుల కోసం వాట్సాప్ ఛానల్‌ను అందుబాటులోకి తీసుకురాగా రైతు ముంగిటకు శాస్త్ర సాంకేతిక రంగాలు చేరాయి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి... వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, చొప్పదండి



ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులు రైతు వేదికలకు వచ్చి శాస్త్రవేత్తలు, అధికా రుల దృష్టికి సాగు సమస్యలు తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవచ్చు. ఉద్యానవనశాఖ శాస్త్రవేత్తలు కూడా అందుబాటులో ఉంటారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


రాజశేఖర్(ఫైల్)

కోరుట్ల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన పుల్లవేణి రాజశేఖర్(35) అనే యువకుడు అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లవేణి రాజశేఖర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడసరైన ఉద్యోగం దొరక్క పోవడంతో సంవత్సరం క్రితం స్వగ్రామమైన అయిలాపూర్‌కు తిరిగివచ్చి చికెన్ బిర్యాని సెంటర్ నడుపుతున్నాడు. అదిసరిగా నడవక పోవడంతో మద్యానికి బానిసై రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం సమయంలో గ్రామశివారులోని మల్లన్న గుట్ట సమీపంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. రైతులు పోలీసులతో పాటు బంధువులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. రాజశేఖర్ భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజశేఖర్‌కు భార్య సంధ్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నాడు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


సిద్ధార్థ(ఫైల్)

ఇబ్రహీంపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామశివారులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలోపడి పల్లికొండ సిద్ధార్థ (18) అనేయువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మామడ మండలం పోస్కల్ గ్రామానికిచెందిన సిద్ధార్థ ఈనెల6న చేపలు పట్టడానికి మూలరాంపూర్ గ్రామశివారులోని సదర్‌మట్ ప్రాజెక్టుగేట్ నెంబర్ 52 వద్దకు వెళ్లాడు. అక్కడ సిద్ధార్థ వలతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు ముందుకు పడి తలకు బలమైగాయమై నీటిలో పడి చనిపోయాడు. మృతుడు తండ్రి గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

కోనరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని రెండు బంగారు పుస్తెలు, ఒక బంగారు ముక్కుపోగు, 4 వెండిమట్టెలు అపహరించారు. గుడిలో పనిచేసే వంకాయల లక్ష్మీరాజం సాయంత్రం గుడికి వెళ్లి చూసేసరికి గుడికి వేసిన తాళం లేదు. లోపలకి వెళ్లి ఆభరణాలు కనిపించలేదు. ముదిరాజ్ సంఘం నాయకుడు తుమ్మల బాబు ఫిర్యాదుతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

విషాహారం తిని 36 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ధర్మారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లిలో విషాహారం తిని 36గొర్రెలు మృతిచెందగా 200 గొర్రెల వరకు అస్వస్థతకు గురయ్యాయి. పెర్కపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు గొర్రెల కాపరులు బుధవారం గ్రామంలో కోసిన పంట పొలాల్లో గొర్రెలు మేపేందుకు వెళ్లారు. మందలో రెండు వందలకు పైగా గొర్రెలు ఉండగా కొన్ని సాయంత్రం వరకు అస్వస్థతకు గురయ్యాయి. దీంతో కాపరులు సొంత వైద్యంతో పాటు వెటర్నరీ మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి వాడినట్లు సమాచారం. అప్పటికే మందలోని కొన్ని గొర్రెలు తీవ్రఅస్వస్థతకు గురై గురువారం సాయంత్రం మరణించగా, శుక్రవారం ఉదయం మరికొన్ని మరణించాయి. దీంతో ఆందోళనకు గురైన యాదవులు మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన మంత్రి జిల్లా పశువైద్యాధికారి విజయ్ భాస్కర్‌కు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించి అత్యవసర చికిత్స అందించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో గ్రామానికి చేరుకొని చనిపోయిన 36 గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రెండు వందల గొర్రెలకు చికిత్స అందించారు. పోస్టుమార్టంలో కొన్నిగొర్రెలు వడ్లు తిని చనిపోగా మరికొన్ని విషాహారాన్ని తిని మృతిచెందినట్లు పశువైద్య అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. నమూనాలను కరీంనగర్‌కు పంపగా అక్కడి నుంచి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు వైద్యులు తెలిపారు. వారంలో రిపోర్టులు వస్తాయని అప్పటివరకు మృతికి గల కారణాలు స్పష్టంగా చెప్పలేమని మండల వైద్యాధికారి అజయ్ తెలిపారు.

మంత్రి ఆదేశాలతో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు సోగాల తిరుపతి, బుట్టి సాగర్, ఓరెం చిరంజీవి యాదవ సంఘం అధ్యక్షుడు అప్పాల శ్రీను మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు.

సేల్‌డీడ్‌కు రిజిస్ట్రార్ నిరాకరణ

● ఆందోళన వ్యక్తం చేసిన దంపతులు


నిరాకరించిన డాక్యుమెంటుతో తోట శ్రీకాంత్ దంపతులు

గంగాధర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకే అపార్ట్‌మెంటులో బ్యాంకు మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేసి అదే అపార్టుమెంటులో మరొకటి సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారిని నిరాకరిస్తూ, చేయరాదంటూ రిజిస్ట్రార్ వెనక్కిపంపించారు. కరీంనగర్ పట్టణ కేంద్రం మారుతీ నగర్‌కు చెందిన తోట శ్రీకాంత్ రేకుర్తి గ్రామంలోని సర్వే నంబరు 80, లేపాక్షి పరివార్ అపార్ట్‌మెంట్‌లో ప్లాట్‌నెంబరు 304కొనుగోలు చేశాడు. అక్టోబరు 18న సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ కోసం గంగాధర సబ్‌రిజిస్ట్రార్‌కు డాక్యుమెంటు సమర్పించాడు. అయితే శ్రీకాంత్ డాక్యుమెంటును ఈనెల4న డీటీఈపీ నిబంధనలు, జిల్లాకలెక్టర్ చింతకుంట గ్రామానికి సంబంధించిన ఉత్తర్వులను కారణం చూపుతూ నిరాకరించారు. కానీ అదేసబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంతకు ముందు అదే అపార్ట్‌మెంటు, అదేసర్వే నంబర్ సంబంధించిన మార్టిగేజ్(బ్యాంకు టైటిల్ డీడ్ డిపాజిట్) లావాదేవీలను రిజిస్టర్ చేశారని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆ ఆస్తిపై ఎటువంటి నిషేధ ఉత్తర్వులు లేవని, చట్టబద్ధమైన బదిలీని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఉత్తర్వులు నిజంగా నిషేదిస్తున్నాయంటే అదేఆస్తికి బ్యాంకు మార్టిగేజ్ ఎలా అంగీకరించబడింది, సేల్‌డీడ్‌కు నిరాకరిస్తూ మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లను అనుమతించడం ఎలా సాధ్యమని శ్రీకాంత్ పేర్కొన్నారు. రేకుర్తి గ్రామంలోని లేపాక్షి పరివార్ ఎటువంటి నిషేది జాబితాలో లేదని అటువంటి పరిస్థితిలో తన ప్లాటును నిరాకరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులను ఉదహరిస్తూ చట్టపరమైన నిషేద ఉత్తర్వులు లేకుండా రిజిస్ట్రేషన్లను నిరాకరించడం రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్71,72లకు వ్యతిరేకమని ఆయన అన్నారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ వద్ద అప్పీల్‌కు దాఖలు చేస్తామని తెలిపారు.

నిప్పంటించుకుని వివాహిత ఆత్మహత్యాయత్నం

● కాపాడి ఆసుపత్రికి తరలించిన పోలీసులు, మెడికల్ కళాశాల విద్యార్థులు


స్వప్నను ఆసుపత్రికి తరలిస్తున్న సీఐ, పోలీసులు, మెడికల్ కళాశాల విద్యార్థులు


స్వప్న(ఫైల్)

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్ కళాశాల రహదారి పక్కన, ఆర్‌టీసీ డిపో వెనుక శుక్రవారం రాత్రి సల్ల స్వప్న(35) అనేవివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంటల్లో కాలుతున్న ఆమె ప్రాణభయంతో అరవడంతో అటుగా వెళుతున్న మెడికల్ విద్యార్థులు, యువకులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, వైద్యకళాశాల విద్యార్థులు చెట్ల పొదల్లో తీవ్రగాయాలతో పడిఉన్న స్వప్నను రక్షించి ఆటోలో గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెపరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు. ఆమె సూసైడ్ లెటర్ రాసి బ్యాగులో పెట్టుకుంది. నా చావుకు ఎవరూ కారణం కాదని, రెండు నెలలుగా డిప్రెషన్‌లో ఉన్నానని, ఏ పనిచేయలేకపోతున్నానని, అనారోగ్యంతో బాధపడుతున్నా నని, భయం భయంగా ఉందని, నామీద నాకు నమ్మకం లేదంటూ పేర్కొన్నది. యైటింక్లయిన్‌కాలనీ సమీపంలోని పోతనకాలనీలో సల్ల స్వప్న కుటుంబం నివాసముంటున్నారు. ఆమెభర్త సతీష్ దగ్గరలోని జూలపల్లి ఆదర్శనగర్‌లో కిరాణాషాపు నడుపుకుంటున్నాడు. ఇద్దరు పిల్లలు. మానసి కస్థితి సరిగా లేక రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. స్వప్నను రక్షించి ఆసుపత్రికి తరలించిన సీఐ ఇంద్రసేనారెడ్డి, మెడికల్ కళాశాల విద్యార్థులను పలువురు అభినందించారు.

రుణం చెల్లించాలని ఇంటికి తాళం

● రోడ్డున పడ్డ వృద్ధ దంపతులు


రోదిస్తున్న వృద్ధ దంపతులు

వేములవాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటిపై తీసుకున్న రుణం తాలూకు బకాయిలు చెల్లించడం లేదని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ వారు ఇంటికి తాళం వేయడంతో ఆ ఇంటినే నమ్ముకుని జీవిస్తున్న వృద్ధ దంపతులు రోడ్డున పడ్డారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మల్లారం గ్రామానికి చెందిన మల్లారం రాజయ్య, పోశవ్వకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడైన మల్లారం శ్రీనివాస్ ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఇంటిని తాకట్టు పెట్టి రూ.14లక్షల రుణం తీసుకున్నాడు. సంవత్సరకాలంగా ఎలాంటి వాయిదాలు చెల్లించలేదు. తీసుకున్న బకాయిలు చెల్లించాలని సంస్థ వారు పంపిన నోటీసులకు సమాధానం లేకపోవడంతో సదరు సంస్థ వారు కోర్టును ఆశ్రయించారు. రెండు రోజుల క్రితం ఇంటి సామాను బయటవేసి ఇంటికి తాళంవేశారు. తాము నివాసముం టున్న ఇంటికి తాళం వేయడంతో దిక్కుతోచని స్థితిలోఉన్న రాజయ్య పోశవ్వలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. చిన్నకుమారుడు శ్రీనివాస్ ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో ఇంటిపరిసరప్రాంతాలలో తలదాచుకుంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న రాజయ్య పోశవ్వ దంపతుల పరిస్థితి స్థానికులను కలిచివేస్తోంది.

ఎక్సైజ్ అధికారుల దాడులు


బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

గంభీరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, లక్ష్మీపూర్, లింగన్నపేట, ముచ్చర్ల గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 300లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, ఇద్దరు అనుమానితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా లింగాపూర్ తండాలో బైండోవర్ ఉల్లంఘన కింద ఒకరికి జరిమానా విధించినట్టు వెల్లడించారు.

పొలంలో కొండచిలువ

శంకరపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్‌లో పొలంలో కొండచిలువ కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్‌లో ఓ రైతు తనపొలంలో హార్వెస్టర్‌తో వరికోయిస్తున్నాడు. ఈక్రమంలో కొండచిలువ హార్వెస్టర్ బ్లేడుకు తగిలి డ్రైవర్‌కు కనిపించింది. డ్రైవర్, సమీప రైతులు పొలం నుంచి కొండచిలువను బయటకు తీసుకువచ్చేసరికి మృతిచెందినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వెన్నంపల్లి విద్యార్థులు


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

సైదాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్ 2025లో రాష్ట్రస్థాయిలో ప్రథమబహుమతి పొంది జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోద్యాయుడు రాయి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. డోలువాయిద్యం పోటీలలో అమరగొండ రోహిత, అమరగొండ అశ్వర్, వెంగల ఆశీష్‌వర్దన్ చిగుర్ల రిత్విక్‌లు హైదారాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనపరిచి పుణేలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యార న్నారు. ఎంపికైన విద్యార్థులకు, వారికి తర్ఫీదు ఇచ్చిన పీడీ జ్యోతికి ప్రధానోపాధ్యాయుడు రాయిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శుభా కాంక్షలు తెలిపారు.

లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ శివారులో శుక్రవారం ధాన్యం లోడుతో వెళుతున్న లారీ తగిలి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. కరెంటు సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. ధాన్యం లోడుతో బయలుదేరిన లారీ కరెంటు తీగలు అడ్డుగా ఉండడంతో గమనించని డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడిపించాడు. దాంతో కరెంటు స్తంభం విరిగిపోయింది. సమాచారం అందుకున్న 'సెస్' సిబ్బంది మరమ్మతు చేపట్టారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బోయినపల్లి నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. రేకుర్తిగ్రామానికి చెందిన కోట పోచయ్య, బోయినపల్లి మండలకేంద్రానికి చెందిన నల్లగొండ రాకేష్ రేషన్ కార్డుదారుల వద్ద నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలుచేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. సుమారు 4క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, ఎక్స్‌ఎల్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ పీడీఎస్ బియ్యం రవాణా లేదా అమ్మకానికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్.ఐ రమాకాంత్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామ సమీపంలోని ముస్కుపల్లి వాగు నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసి పట్టుకొని డ్రైవర్, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో రౌడీషీటర్లు ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వన్‌టౌన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా నేరాలను ప్రోత్సహించినా, గొడవలు, దాడులు, బెదిరింపులకు దిగినా కఠినచర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, వారిపై నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీయాక్టు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐలు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్..

మంథని: పోలీసు సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు సర్కిల్ కార్యాలయంలో సీఐ రాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరిపై నిఘా ఉందన్నారు. ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. ఎస్‌ఐ రమేష్ ఉన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు

సుల్తానాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు బాల్య వివాహాలను సంబంధిత అధికారులు అడ్డుకున్నారు. శుక్రవారం మండలంలోని ఓ గ్రామంలో రెండు వేర్వేరుచోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయనే సమాచారంతో జిల్లా కేంద్రానికి చెందిన అధికారులు పోలీసుల సహకారంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఒకచోట పెళ్లికి సిద్ధంగా ఉన్న జంట పారిపోయారు. మరోచోట అధికారులు వెళ్లేసరికే పెళ్లి జరిగిపోయింది. అయితే పెళ్లిజరిగిన జంటకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి విచారణ జరుపుతున్నారు. పారిపోయిన జంటను శనివారం తమ ఎదుట హాజరు పరచాలని ఇరువురి తల్లిదండ్రులను ఆదేశించారు.

రాజన్న సన్నిధిలో భక్తుల సందడి


కార్తీక దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు

వేములవాడ టౌన్, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేముల వాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో భక్తజనసందడి నెలకొంది. శుక్రవారం వేలాది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్న సన్నిధిలో భక్తులు స్వామివారిని లఘుదర్శనం చేసుకున్నారు. శ్రీభీమేశ్వరాలయంలో కోడెమొక్కులు చెల్లించి అర్జిత సేవలైన కళ్యాణం, సత్య నారాయణ వ్రతం, కుంకుమపూజలు, అభిషేకాలు, అన్న పూజలు, మహాలింగార్చనలు, పల్లకి సేవలు, ఆకుల పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరస్వామివారి కళ్యాణ మండపంలో కార్తీక పురాణ ప్రవచనం నిర్వహించారు.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా కార్తీకదీపోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి సుహాసినిలచే కార్తీక దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలి

● యూనివర్సిటీకి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం శ్రద్ధ తీసుకోవాలి
● విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి
● 'శాతవాహన' ద్వితీయ స్నాతకోత్సవంలో ఛాన్సలర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
● 25 మందికి పీహెచ్‌డీ పట్టాలు... 161 మందికి బంగారు పతకాలు


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్


ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

కరీంనగర్ టౌన్/గణేష్‌నగర్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'విద్యార్థులు ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంగా ముందు కెళ్లాలి' అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శాతవాహన యూనివర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్, ఛాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయపథం దిశగా తీసుకెళుతుందన్నారు. విద్యార్థుల మేధాశక్తే వారి ప్రయోగశాల అని అభివర్ణించారు.

విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యారంగం సాంకేతికతతో ముందుకు సాగుతోందని, బోర్డు, చాక్‌పీస్‌లకే పరిమితం కావద్దని అన్నారు. డిజిటల్ లర్నింగ్, భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని చెప్పారు. నైపుణ్యం, నిరంతర అభ్యాసాలు విద్యార్థి విజయానికి దోహద పడతాయని తెలిపారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరువవద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని గవర్నర్ అన్నారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని, భయాన్ని, అలసటను అధిగమించి ముందుకు సాగాలన్నారు. కృషితో ప్రతి విద్యార్థి అభివృద్ధి సాధ్యమేనన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

'శాతవాహన' ప్రస్థానం స్ఫూర్తిదాయకం

ప్రొఫెసర్ బీజే రావు, హైదరాబాద్ విశ్వవిద్యాలయ వీసీ



ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయ ప్రస్థానం స్ఫూర్తిదాయకమన్నారు. రెండు దశాబ్దాల కంటే తక్కువ వ్యవధిలో ఈ సంస్థ తెలంగాణాలోని ఉత్తర ప్రాంతంలో అభ్యాసానికి, ఉన్నత విద్యకు కీలకమైన కేంద్రంగా మారిందని అన్నారు. ఆరు సంవత్సరాల్లో విశ్వ విద్యాలయంలో 1,03,454 మంది అండర్ గ్రాడ్యుయేట్లలో 55,000 మందికి పైగా విద్యార్థులు పట్ట భద్రులయ్యారని, 34,561 మందిలో 25,310 మంది పీజీ డిగ్రీలను సొంతం చేసుకున్నారన్నారు.

కొత్త కోర్సులు ప్రవేశ పెడుతున్నాం

ప్రొఫెసర్ యు ఉమేశ్‌కుమార్, 'శాతవాహన' వీసీ



శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ యు ఉమేశ్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 156 కళాశాలలు యూజీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులను అందిస్తున్నాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులను ప్రవేశ పెట్టామన్నారు. ఎం ఫార్మసీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీటెక్ కోర్సులు ప్రారంభించామని చెప్పారు. వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత బయోమెట్రిక్ హాజరు అమలు చేశామని, విద్యార్థుల భద్రత కోసం 100 కెమెరాలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, కలెక్టర్ పమేలా సత్పతి, పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

● ఈ సందర్భంగా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన 25 మందికి డాక్టరేట్ పట్టాలను, 2018 నుంచి 2023 వరకు వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలను గవర్నర్ అందజేశారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం... పోలీసు గౌరవ వందనం

కరీంనగర్‌కు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అధికారులు ఘనస్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు రావలసిన గవర్నర్ 15 నిమిషాల ముందే యూనివర్సిటీకి చేరుకున్నారు. పరిపాలన విభాగం భవనం ముందు పోలీసులు ఆయనకు గౌరవవందనం సమర్పించగా, వీసీ ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.



హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అధికారులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ఇష్టపడి చదివితే ఏదైనా సాధ్యం..: నర్మద



నేను అగ్రహారం డిగ్రీ కళాశాలలో చదివాను. తెలుగు డిపార్ట్‌మెంట్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించాను. నన్ను ప్రోత్సహించిన తెలుగు హెచ్‌వోడీ లక్ష్మీనారాయణ సార్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు. నాలుగు బంగారు పతకాలు అందుకోవడం సంతోషాన్నిచ్చింది.

ఇదే స్ఫూర్తితో ముందుకుసాగుతా.. : అమరనంద



మాది ధర్మారం రాజారాంపల్లి. తెలుగు డిపార్ట్‌మెంట్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం ఆనందాన్నిచ్చింది. ఈ గోల్డ్ మెడల్స్ సాధించడానికి ప్రోత్సాహం ఇచ్చిన తెలుగు డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు లక్ష్మీనారాయణకు రుణపడి ఉంటాను. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు కొనసాగిస్తాను.

అధ్యాపకులు, కుటుంబ సభ్యుల సహకారంతో.. కామినేని సాయిచరిత్ర



నేను వివేకానంద డిగ్రీ, పీజీ, కళాశాలలో ఎంబీఏ హెచ్‌ఆర్ చదువుకున్న. రెండు గోల్డ్ మెడల్స్ సాధించా. మా అధ్యాపకులు, కుటుంబ సభ్యుల సహకారంతోనే ఇది సాధ్యమైంది.

నా కష్టానికి ఫలితం దక్కింది..: వసీమా



నేను ఎంబీఏ ఫైనాన్స్ చదువుకున్న. నాకు చిన్నప్పటి నుంచి ఇష్టపడి చదవడం అలవాటు. అలా చదవడం వల్ల ఈ రోజు బంగారు పతకం సాధించా. చాలా సంతోషంగా ఉంది. నా కష్టానికి ఫలితం దక్కింది.

రెండు బంగారు పతకాలు సాధించాను: బూర నవీన్



మాది వేములవాడ మండలం మారుపాక. ఎంఏ సోషియాలజీ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించాను. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు అభినందనలతో ముంచెత్తారు.

సంతోషంగా ఉంది.. కాల్వ వెంకటేశ్



ఎంబీఏ మార్కెటింగ్ 2017-19 సంవత్సరంలో చదువుకున్నా. నేను పేద కుటుంబం నుంచి వచ్చాను. రూరల్ బ్యాక్ గ్రౌండ్ అయినా కష్టపడి చదివి నేను అనుకున్నది సాధించాను. దీనికి మా తల్లిదండ్రులు, అధ్యాపకులే ప్రధాన కారకులు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం ఆనందంగా ఉంది.

తల్లిదండ్రులకు, గురువులకు కృతజ్ఞతలు: కొండ ప్రవళిక



మాది రాయికల్ మండలం మూటపల్లి గ్రామం. శాతవాహన యూనివర్సిటీలో 2019లో ఎంఏ తెలుగు పూర్తి చేశాను. ప్రాచీన సాహిత్యంలో నాకు గోల్డ్ మెడల్ వచ్చింది. ఇందుకు సహకరించిన గురువులకి, తల్లిదండ్రులకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ప్రోత్సాహాన్నిచ్చింది.. తొటం సునిల్



రంగాపూర్ గ్రామానికి చెందిన నేను అర్థశాస్త్రంలో బంగారు పతకం సాధించాను. పతకాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. నా కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. నా భవిష్యత్తుకు ప్రోత్సాహాన్నిచ్చింది.

అమ్మ నాన్నల చేతుల మీదుగా అందుకుంటే బాగుండేది.. : మోడెం క్రాంతికుమార్



ఖమ్మం జిల్లాకి చెందిన నేను ఎంఏ సోషియాలజీ విభాగంలో బంగారు పతకాన్ని సాధించాను. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. అమ్మనాన్నల చేతుల మీదుగా అందుకుంటే మరింత సంతోషంగా ఉండేది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..: స్పందన



కెమిస్ట్రీ విభాగంలో నాకు బంగారు పతకం రావడానికి మా తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడింది. వారికి, శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ప్రస్తుతం టీచింగ్ ఫీల్డ్‌లో ఉన్నాను. ఇదే స్ఫూర్తితో ఉన్నత విజయాలు సాధిస్తా.

గొప్ప అనుభూతి.. డాక్టర్ జమున, పీహెచ్‌డీ స్కాలర్



నేను జగిత్యాల ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలుగా పని చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకోవడం ఆనందంగా ఉంది. ఇది నాకు గొప్ప అనుభూతి. శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ సంతోషం మాటల్లో చెప్పలేనిది.. డాక్టర్ ఫాతిమా సుల్తానా, పీహెచ్‌డీ స్కాలర్



నేను మానకొండూరు మండలం పోచంపల్లి మోడల్ స్కూల్లో పని చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ సంతోషం మాటల్లో చెప్పలేనిది.

యూనివర్సిటీకి కృతజ్ఞతలు డాక్టర్ ఎన్ మాల్లారెడ్డి, పీహెచ్‌డీ స్కాలర్



పీహెచ్‌డీ పట్టాను గవర్నర్ చేతుల మీదుగా తీసుకోవడం ఆనందంగా ఉంది. 2023లో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసినందుకు నాకు ఈ రోజు పట్టా ఇచ్చారు. శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

తోటి గిరిజన తెగపై పరిశోధన చేశా.. డాక్టర్ మరక శ్రీనివాస్, పీహెచ్‌డీ స్కాలర్




గిరిజన తెగల్లో అతి తక్కువ జనాబా ఉన్న తోటి గిరిజన తెగపైన పరిశోధన చేశా.. గవర్నర్ చేతుల మీదుగా పట్టా తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ పరిశోధనకు సహకరించిన గురువు వన్నాల రమేష్‌కు, కుటుంబ సభ్యులందరికి కృతజ్ఞతలు.

కొనసాగుతున్న జోనల్‌స్థాయి ఆటల పోటీలు


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో 11వ జోనల్‌స్థాయి ఆటల పోటీలలో భాగంగా శుక్రవారం రెండోరోజు పోటీలు కొనసాగాయి. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ 14 విభాగంలో క్యారమ్ డబుల్స్‌లో మానకొండూర్ ప్రథమ, దుబ్బాక ద్వితీయ, చెస్‌లో దుబ్బాక ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయస్థానాలు సాధించాయి. అండర్-17 విభాగంలో కబడ్డీలో కోహెడ ప్రథమ, చేర్యాల ద్వితీయ, క్యారమ్ డబుల్స్‌లో హుస్నాబాద్ ప్రథమ, ముస్తాబాద్ ద్వితీయ, చెస్‌లో ముస్తాబాద్ ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయస్థానాలు సాధించాయి. అండర్-19విభాగంలో ఖోఖోలో మానకొండూర్ ప్రథమ, కోహెడ ద్వితీయ, బాల్ బ్యాడ్మింటన్‌లో మానకొండూర్ ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయ, చెస్‌లో కోహెడ ప్రథమ, అల్వాల్ ద్వితీయ స్థానాలు సాధించాయి.

వైభవంగా గోదావరి హారతి


ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న వేదపండితులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో గోదావరి హారతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, హరినామ సంకీర్తనలతో గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సుధగోని లహరి ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం సిరిసిల్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో లహరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వ్యాయామ ఉపాధ్యాయుడు తడకల సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శారద మాటాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లహరి చదువుతో పాటు ఆటల్లో రాణిస్తోందన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి 10 వరకు ఖమ్మం జిల్లా పినపాక మండలం బయ్యారంలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు నుంచి లహరి పాల్గొంటుందని తెలిపారు.


లహరికి మెమొంటోను అందిస్తున్న హెచ్‌ఎం శారద

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి వంకాయల నందన్‌సాయి ఎంపికయా డు. విద్యార్థి వంకాయల నందన్ సాయిని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, ఆర్చరీ కోచ్ మహేందర్, హరీష్, భారతి విద్యాలయం పాఠశాల కరస్పాండెంట్ రామ్‌రెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణాకర్ శుక్రవారం అభినందించారు.

తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రం కొత్తపల్లి లోని అల్ఫోర్స్ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ జూనియర్స్, సబ్ జూనియర్స్ పోటీలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వంకాయల నందన్‌సాయి ఇండియన్ రౌండ్‌లో ప్రథమస్థానంలో నిలిచి ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 9న రంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో జరిగే పోటీల్లో నందన్‌సాయి ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొననున్నారు.


నందన్ సాయి

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం శుక్రవారం తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం రెండు గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మోయతుమ్మెద వాగునుంచి 3,282 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండగా, రెండు గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 254 క్యూసెక్కులు మొత్తం 4,254 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.

అట్టహాసంగా జాతీయస్థాయి కరాటే పోటీలు ప్రారంభం

- హాజరైన సినీ హీరో సుమన్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ హీరో, కరాటే లెజెండ్ డాక్టర్ సుమన్ తల్వార్ ప్రారంభించారు. కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా నేషనల్ అకాడమీ చీఫ్ ఇ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో దేశవ్యాప్తంగా 1200 మంది క్రీడాకారులు పోటీ పడనున్నారు. ఈ సందర్భంగా హీరో సుమన్ మాట్లాడుతూ కరాటే ప్రపంచంలోనే నంబరువన్ క్రీడగా అవతరించిందని, ఎక్కువ దేశాల్లో కరాటేకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతన్నారు.

ఈరోజుల్లో అమ్మాయిల మీద జరుగుతున్న సంఘటనలు తనను చాలా బా ధించాయని, కరాటే నేర్చుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు కరాటే నేర్చుకోవాలని సూచించారు. మలేషియా గ్రాండ్ మాస్టర్ అనంతన్, టోర్నమెంట్ చీఫ్ అడ్వయిజర్ రవీందర్ కుమార్, వసంత్ కమార్, సురభి వేణుగోపాల్, గౌరు రాజిరెడ్డి, ఐలయ్య, మొండయ్య, మన్నన్, ఆర్గనైజర్ మాడుగుల ప్రవీణ్, ప్రసన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ హీరో సుమన్, పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

ఐదు దశాబ్దాలుగా ఎన్టీపీసీ వెలుగులు

- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత - ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

జ్యోతినగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా దేశానికి వెలుగులను అందిస్తూ ప్రపంచ అగ్రగామి సంస్థగా ఎన్టీపీసీ వెలుగొందుతోందని రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత అన్నారు. ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. దేశాభివృద్ధికి ఎన్టీపీసీ చేయూతనందిస్తోందన్నారు. పారిశ్రామిక, గృహ అవసరాలకు విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. దేశంలో నాలుగో వంతు విద్యుత్‌ను ఎన్టీపీసీ సంస్థ నిరంతరాయంగా అందిస్తోందన్నారు. ఎన్టీపీసీ సిబ్బంది కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు పనిచేయా లని ఆయన కోరారు. విద్యుత్పత్తితోపాటు సామాజిక అభివృద్ధికి ఎన్టీపీసీ కృషి చేస్తోందన్నారు. ఎన్టీపీసీ కాకతీయ ఆడిటోరియం, ఈడీ రెసిడెన్షియల్ ఏరియాలో మాస్ ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చందన్‌కుమార్ ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈడీ కేక్ కట్ చేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా విభాగాల జీఎంలు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఈడీ చందన్ కుమార్, అధికారులు

పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

రూ.2.50 అదనంగా చెల్లిస్తున్నారు. గతంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.5.45 ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ. 8.17 చెల్లించేవారు. పెరిగిన మెనూ చార్జీలతో మరింత నాణ్యతగా భోజనం అందించడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

ఇంటి నుంచే బాక్సులు

జిల్లాలో ఇప్పటికీ కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇంటి నుంచి మధ్యాహ్నం భోజనం తెచ్చుకుంటున్నారు. బియ్యం నాణ్యతగా లేకపోవడంతో అన్నం ముద్ద అవుతుందని విద్యార్థులు తెలుపుతున్నారు. కొన్నిచోట్ల పూర్తిగా నాణ్యత పాటించకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి లంచ్ బాక్సులు తెచ్చుకుంటున్నారు. పౌష్టికాహారం అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిరుపేద బాలికలకు దుస్తుల పంపిణీ



గౌన్‌లు పంపిణీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ప్రాంతంలో ఉన్న బుడగజంగాల కాలనీలోని నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలకు శుక్రవారం సాయంత్రం గౌన్‌లను వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డి పంపిణీ చేశారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సన్మానం కార్యక్రమాలలో వచ్చిన శాలువాలను ఏదైనా ఉపయోగపడే విధంగా తయారు చేయాలని ఎమ్మెల్యే కుమారుడు ఆది కార్తీక్ ఆలోచనతో గౌన్‌లను కుట్టించారు. ఈ గౌన్‌లను నిరుపేద బాలికలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ వీరప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్

సిరిసిల్ల రూరల్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యలను శాంతియుతంగా త్వరితగితన పరిష్కరించుకునేందుకు ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధిరార సంస్థను వినియో గించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధిక జైస్వాల్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిం చారు. ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా కోర్టు సముదాయంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వందేమాతరం 150 సంవత్సరాల సందర్భంగా వందేమాతరం ఆలపించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు, ఎంఈవో దూస రఘుపతి, జీపీ కళ్యాణ్ చక్రవర్తి, టౌన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడిగా ఎంతో మంది అభిమానుల మనస్సు దోచుకున్న పద్మవిభూషన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత మెగాస్టార్ చిరంజీవిపై సోషల్ మీడియాలో జోసఫ్ అనే వ్యక్తి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని చిరంజీవి, పవన్ కళ్యాన్, రాంచరణ్ అభిమానులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జోసఫ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల పట్టణ సీఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ అభిమానులు కోడం రాంప్రసాద్, కోడం బాలప్రసాద్, బొడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

గంభీరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు గంభీరావుపేట మండలానికి చెందిన సైమా అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో సైమా అకాడమీ క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబర్చి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రహర్షిని, యశ్వంత్, రుత్విక్, సాకేత్, అనన్య, సామిప్రసన్న, శ్రీ హర్షవర్ధన్‌లు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు అకాడమీ ఫౌండర్ విక్రమ్ తెలిపారు. ఈ నెల 8,9 తేదీలతో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వీరిని కోచ్ దేవయ్య, ఉష్ కోచ్ విక్రమ్, అథ్లెటిక్స్ కోచ్ జంపన్న, పాఠశాల హెచ్ఎం, పీఈటీలు అభినందించారు.

ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్

పోటీలలో సత్తాచాటిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టీ-సాట్, అండ్ టీఎస్ జీహెచ్ఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రం నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ టాలెంట్ టెస్టు పోటీలలో విద్యార్థులు సత్తాచాటారు. మండల స్థాయి ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ టాలెంట్ టెస్టు పోటీలలో విజేతలైన విద్యార్థులను మండల విద్యాధికారి దూస రఘుపతి, సెక్టోరియల్ అధికారిని శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మోతిలాల్ మెరిట్ సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టి-సాట్ తెలంగాణ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రాజు, ప్రతిభ, పాల్గొన్నగా న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు మేడికాల అంజయ్య, అంబటి శంకర్, అగ్రవ చారి, అమర్‌నాద్, కార్తీక్, సుధారాణి, ప్రకాశ్, వ్యవహరించారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీ-సాట్, తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పాటవ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఉపన్యాస, క్విజ్, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం మండల అధ్యక్షుడు, కాంప్లెక్ హెచ్ఎం మనోహరచారి పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు చంద్రశేఖర్, మురళీధర్, కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముస్తాబాద్: మండల కేంద్రంలో నిర్వహించిన వ్యారచన, ఉపన్యాస, క్విజ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సభ్యులు శనిగరం సుధాకర్, నిమ్మ రాజిరెడ్డి, బండెల రాజ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటగోపాల చారి, గణేశ్, వేణుమాధవ్, బొప్ప సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని మానవవనరుల కేంద్రంలో విద్యార్థులకు శుక్రవారం పోటీలను నిర్వహించారు. టీఎస్‌ఏటి, టీఎస్‌జీహెచ్ఎమ్ఏలు సంయుక్తంగా నిర్వహించిన ఉపన్యాస, క్విజ్ పోటీలలో పెద్దలింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విఘ్నేష్, నితన్, కందికట్కూర్ పాఠశాలకు చెందిన శ్రీచందనలు మొదటి స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, రాజ్‌కుమార్, రమేష్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వందేమాతరం గేయాలాపన



వందేమాతరం గేయాలపనలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్



వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో వందేమాతరం ఆలపిస్తున్న పోలీసులు



ఎల్లారెడ్డిపేటలో ఠాణాలో వందేమాతరం గేయాలాపన

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : దేశ స్వాతంత్ర్య ఉద్యమకాలంలో బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయం 150 సంవత్సరాల సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం వందేమాతరం గేయాలపన కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టరేట్‌లో వందేమాతర గేయాలపన కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి చేపట్టగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, సీపీవో శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం వందేమతారం గేయలాపనలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్‌బీగీతే పాల్గొని వందేమాతరం గేయాన్ని అలపించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్‌లు నాగేశ్వర్‌రావు, మధుకర్, రవి, ఆర్ఐలు రమేష్, యాదగిరి, ఎస్ఐలు కిరణ్‌కుమార్, క్రాంతి కుమార్, రాజు, సాయికిరణ్, జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: జిల్లా కేంద్రంలో వేరువేరుగా ఆయా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సామూహికంగా వందేమాతర గీతాలాపన చేశారు. స్థానిక ప్రభుత్వ బాలబాలికల జూనియర్ కళాశాలలో డీఐఈవో వై శ్రీనివాస్ వందేమాతర గీతాలాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతర గీతం జాతీయ భావాన్ని పెంపొందించిందన్నారు. భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమ సమరానికి నాంది అయిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలబాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, కే విజయరఘనందన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సామల వివేకనంద్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో శుక్రవారం వందేమాతర గీతంను విద్యార్థులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ అడిషనల్ డీఎంఈ, కళాశాలలోని అన్ని శాఖల అధికారులు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో వందేమాతరం గీతాన్ని శుక్రవారం ఆలపించారు. ఈ కార్యక్రమంలో సిఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు రామ్మోహన్‌గౌడ్ , ఎల్లాగౌడ్, మోతిరాం, పోలీసులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో విద్యార్థులు, అధికారులు, పోలీసులు శుక్రవారం వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు రాహుల్‌రెడ్డి, లక్ష్మణ్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాల సందర్భంగా మండలంలో సామూహిక గేయాలాపాన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో శుక్రవారం వందేమాతర గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీఓ శ్రీనివాస్, మండలపరిషత్ సూపరిండెంట్ శ్రీనివాస్‌లతో పాటు వివిద శాఖల అధికారులు,పాల్గొన్నారు.

గంభీరావుపేట : మండల కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ ప్రభుత్వ కళాశాలల్లో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందేమాతర గీతాన్ని రచించి, 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురష్కరించుకుని స్థానిక తహసీల్, మండల పరిషత్, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో వందేమాతరం ఆలపించారు.

వేములవాడ రూరల్ : వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విద్యార్థులతో కలిసి పోలీసులు శుక్రవారం వందేమాతర గీతం ఆలపించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వందేమాతర గీతం భారత జాతీయోద్యమానికి ఆత్మగా నిలిచిందన్నారు. అనంతరం ఎస్సై వెంకట్రాజం విద్యార్థులకు పళ్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ఏఎస్సై రవీందర్, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాజం, కానిస్టేబుల్‌లు వెంకటేష్, శ్రీనివాస్, సతీష్, ఆరిఫ్, రమేస్, లహరి, ప్రియ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట : దేశ స్వాతంత్ర ఉద్యమ కాలంలో స్వాతంత్ర్య పోరాటానికి వందేమాతరం గేయం ప్రజలకు ప్రేరణగా నిలిచిందని ఎస్సై ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఏఎస్ఐలు లక్ష్మణ్, తిరుమల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

చందుర్తి: మండల పరిషత్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్ లో సామూహిక వందేమాతర గీతాలపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రాధా, ఎస్సై రమేష్, ఎంపీఓ ప్రదీప్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలు దెబ్బతిన్నరైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): తుపాన్‌తో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల్ కార్ బాలాజీ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ వల్ల చేతికచ్చిన పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. కొట్టుకు పోయిన కాజ్‌వేలు, బ్రిడ్జిలను వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు జింక వెంకటి, ముష్టం శ్రీనివాస్, వికాస్ జితేందర్ రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బోయినపల్లి కాంగ్రెస్ నాయకుల ప్రచారం



జూబ్లీహిల్స్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బోయినపల్లి,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ మద్దతుగా చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో బోయినపల్లి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా సోమాజిగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ కాలనీలో బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, మాజీ డీసీఎంస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి,సెస్ డైరెక్టర్ కొట్టపెల్లి సుధాకర్, సింగిలి విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, మాజీ సెస్ డైరెక్టర్ ఏనుగుల కనుకయ్య, మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజ్యం, మాజీ ఎంపీటీసీ అక్కనపెల్లి ఉపేందర్, వరాల నర్సింగం, కొలుపుల ప్రవీణ్, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలి



యువజనోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

సిరిసిల్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువత లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందుకు సాగాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ పిలుపు ఇచ్చారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని 29వ జాతీయ యువజనోత్సవాలలో భాగంగా శుక్రవారం సిరిసిల్లలో రాజీవ్‌నగర్ మినీ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలను ప్రారంభించారు. వివిధ కళాశాలల యువతీ యువకులు, కళాకారులు, వివిధ కళాబృందాలు పాల్గొన్నాయి. జానపద నృత్యాలు బృందం, జానపద గేయాలు బృందం, కథా రచన, పద్య రచన, కవిత్వం, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీ, ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా వంటి పోటీలు నిర్వహించగా, దాదాపు 400 మంది యువతీ యువకులు, కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత స్వామి వివేకానందుని సందేశాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియాను అవసరం మేరకు వాడాలని సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ రాందాస్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా పాల్గొన్నారు.

బంగారు పతకాలు అందుకున్న అక్కాచెల్లెళ్లు



గవర్నర్ నుంచి బంగారు పతకాలు అందుకున్న నర్మద, నీరజ

చందుర్తి నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అక్కాచెల్లెళ్లిద్దరూ బంగారు పతకాలను అందుకున్నారు. లింగంపేటకు చెందిన కాదాసు నర్మద, నీరజ అనే అక్కాచెల్లెళ్లు అగ్రహారం కళాశాలలో 2020-22 విద్యా సంవత్సరంలో ఎంఏ తెలుగు పూర్తిచేశారు. నర్మద ఎంఏ తెలుగులో అత్యధిక మార్కులు, ఆధునిక కవిత్వం, వ్యాకరణం భాష చరిత్ర, ఆధునిక సాహిత్య విమర్శ అనే అంశంలో నాలుగు బంగారు పతకాలు సాధించారు. నీరజ జానపద విజ్ఞానం అనే అంశంలో అత్యధిక మార్కులు సాధించారు.

ర్యాగింగ్ నేర పూరిత చర్య

- వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడ , నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ నేరపూరిత చర్యల అని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ అన్నారు. శుక్రవారం వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ విద్యార్థి జీవితంపై ప్రభావం చూపుతుందన్నారు. సదస్సులో అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌చారి , అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనవసరమైన లింకులను డౌన్‌లోడ్ చేయవద్దని కోరారు. ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

● ఎల్లారెడ్డిపేట : ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాహుల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో సైబర్ మోసాలపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్లకు లింక్‌లు, మెసేజ్‌లు వస్తే స్పందించకూడదని అన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను ప్రజలు ముందుకు వచ్చి ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నేరాలను అరికట్టడంతో ప్రజలు సహకరించాలని ఎస్ఐ రాహుల్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది. గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



తూకం వేసిన ధాన్యంను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం

ఎల్లారెడ్డిపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాల్లో తేమ శాతం నేరుగా పరిశీలించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని అన్నారు. అకాల వర్షాలకు అన్నదాతలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ధాన్యం తడవకుండా చూసుకోవాలని సూచించారు. ఇటీవల కేంద్రం నిర్వాహకులు రైతుల నుంచి సేకరించిన ధాన్యం రైస్ మిల్లులకు పంపిస్తే తేమ శాతం అధికంగా ఉందని పేర్కొంటూ దిగుమతికి నిరాకరిస్తుండడం వల్ల అన్నదాతలు ఆందోళన దిగి ఇన్‌చార్జీ కలెక్టర్ గరిమ అగర్వాల్‌కు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు డీఏవో అఫ్జల్‌బేగం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం ఉంటనే నిర్వాహకులు ధాన్యం తూకం వేస్తున్నారని గుర్తించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కోనరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ మండల కన్వీనర్ ఇప్పిరెడ్డి గణేష్ రెడ్డి కోరారు. కోనరావుపేటలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 8,500 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు పూజ్యం కార్తీక్ పూర్ణ సుశాంత్‌రెడ్డి,చరణ్, వినయ్, తరుణ్ ఉన్నారు.

సీవీ రామన్‌కు ఘన నివాళి

వేములవాడ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భౌతిక శాస్త్రవేత్త చంద్రశేఖర వెంకటరామన్ 137వ జయంతి సందర్భంగా వేములవాడ న్యూ అర్బన్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మినారాయణ, ఉపాధ్యాయులు దుర్సేటి లక్ష్మినారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడి టీచర్ మంజుల , విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతులపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం'

ముస్తాబాద్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ముస్తాబాద్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్ర మంలో మాజీ ఏఎంసీ చైర్మన్ యాది మల్లేశ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెవుల మల్లేశం, శీలం స్వామి, తాళ్ల రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

గంభీరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 17 హ్యాండ్ బాల్ పోటీల్లో కొత్తపల్లి పాఠశాలకు చెందిన శ్రీహర్షిని, భావన, స్వాతి, రాము, లక్ష్మన్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెలలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొనున్నారు. పాఠశాల కోచ్ భాను, ప్రధానోపాధ్యాయులు వెంకట రామారావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిచారు.

నాటుతున్నారు.. నరుకుతున్నారు

● హరితహారంలో నాటిన చెట్లు నరికివేత



నీళ్లు పోసి పెంచిన మొక్కలను నరికేస్తున్నారు

కోనరావుపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు వృక్షాలుగా మారాయి. నాటిన మొక్కలను నరికేస్తుండటంతో ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారు నుంచి పల్లిముక్త కనగర్తి ఎక్స్ రోడ్డు హరితహారం కార్యక్రమంలో భాగంగా గతంలో నాటిన మొక్కలు వృక్షాలుగా మారాయి. ఒక వైపు రోడ్డు పక్కన విద్యుత్తు తీగలు ఉండడంతో చెట్లు పెరిగి విద్యుత్ తీగలు తగిలి విద్యుతు సరఫరాకు అంతరాయం కలుగుతుందని సెస్ సిబ్బంది చెట్లను నరికివేస్తున్నారు. ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలతో పాటు కొంతమంది ప్రకృతి ప్రేమికులు వేలు ఖర్చుపెట్టి మొక్కలు నాటారు. విద్యుత్తు తీగలు రోడ్డు వెంబడి ఉన్నప్పుడు హరితహారం కార్యక్ర మంలో చేపట్టిన మొక్కలు ముందస్తుగా విద్యుత్తు తీగలు తగలకుండా కొంచెం దూరంలో నాటితే బాగుండేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ప్రకాష్, ప్రకృతి ప్రేమికుడు



కాలుష్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతుంటే మరోపక్క నరికివేస్తున్నారు. ఒక మొక్కను నరకాలంటే మరో మొక్కను నాటాలి. ఇష్టనుసారంగా పెరిగిన చెట్లను తొలగిస్తున్నారు.